ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 11 డిసెంబరు 2024



తెలుగు విజ్ఞాన సమితి సంతాపం

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా కేంద్ర మాజీమంత్రిగా పని చేసిన ఎస్ఎం కృష్ణ మృతిపట్ల పలు సంస్థలు సంతాపం తెలిపాయి నగరంలోని తెలుగు విజ్ఞాన సమితి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షులు గంగరాజు, ఆదికేశవులు నాయుడు, కోశాధికారి వరదరాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి లభించాలని కోరారు. సమితికి అనుబంధంగా ఉండే శ్రీకృష్ణదేవరాయ కళామందిరాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.





నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య



రాజకీయ గురువుకు డీసీఎం డీకే నివాళి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

- అన్నదాతలకు యశస్విని , విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- ఐటీసిటీ... మహిళా గ్రూపులకు అంకురార్పణ..
- మండ్య జిల్లా సోమనహళ్ళి నుంచి అంతర్జాతీయస్థాయికి
- స్పీకర్, మంత్రి, ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్రమంత్రి పదవులు
- ఎస్ఎం కృష్ణ కన్నుమూతతో రాష్ట్ర రాజకీయాల్లో విషాదం
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు .. రాష్ట్ర వ్యాప్తంగా సెలవు
- మూడు రోజులు సంతాప దినాలు..కదలి వచ్చిన అభిమానులు

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా పని చేసిన ఎస్ఎం కృష్ణ దూరదృష్టి కలిగినవారు. ప్రజారంజక పాలన సాగించారని పేరొందారు. పలు పథకాలు ప్రారంభించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నేటికీ నిలిచిపోయారు. రైతులకు యశస్విని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మహిళలకు స్త్రీశక్తి వంటి పథకాలు ఆయన శ్రీకారం చుట్టినవే. బెంగళూరు ఐటీ నగరిగా మారేందుకు కారకులయ్యారు. 1999 నుంచి 2004 వరకు సీఎంగా కొనసాగినప్పుడు బెంగళూరుకు సిలికాన్‌సిటీగా మార్చేందుకు ఐటీ హబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు యూనిఫాం, ఇతరత్రా వస్తువులు ఇవ్వడం సాధారణమని మధ్యాహ్నం భోజనం లేకుంటే చదువు సక్రమంగా సాగదని, పౌష్టికాహారం అందించడం ద్వారా వారిని శక్తివంతులను చేసినట్లు అవుతుందని భావించి మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. తుమకూరు సిద్దగంగామఠం, మైసూరు సుత్తూరుమఠాలకు భక్తుడిగా కొనసాగిన ఎస్ఎం కృష్ణ 2001లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. రైతులు సంపాదించే సొమ్ములో ఆరోగ్యానికే ఎక్కువ ఖర్చు చేస్తారని దేశంలోనే ప్రథమంగా అన్నదాతలకు ఆరోగ్యసేవలు అందించేలా యశస్విని పథకాన్ని తీసుకొచ్చారు. మహిళలను గ్రూపులుగా చేసి స్త్రీశక్తి పథకాన్ని తీసుకొచ్చారు. మహిళాసంఘాలకు ఆదరణ కొనసాగుతోంది.

తెల్లవారు జామునే తుదిశ్వాస..

రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నేతగా కీలకమైన పదవుల్లో కొనసాగిన ఎస్ఎం కృష్ణ (92) కన్నుమూశారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో ఏడాదికాలంగా తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తుదిశ్వాస వీడారు. సదాశివనగర్‌లోని ఇంట్లోనే గుండెపోటుకు గురి కావడంతో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్ఎం కృష్ణ మరణవార్త తెలియగానే రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. సదాశివనగర్‌లోని ఆయన నివాసానికి రాజకీయ, సినిమా, ఐటీ రంగంతోపాటు వివిధ విభాగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు తరలివచ్చారు. మండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్ళిలో మల్లయ్య, తాయమ్మల కుమారుడు సోమనహళ్ళి మలయ్య కృష్ణ (ఎస్ఎం కృష్ణ) జన్మించారు. ఆయనకు భార్య ప్రేమ కృష్ణ, కుమార్తెలు మాళవిక కృష్ణ, శాంభవి కృష్ణలు ఉన్నారు.

ఆయన ఏ పార్టీతో సంబంధం లేకుండా ఇండిపెండెంట్‌గా రాజకీయాలు ప్రారంభించి ఆ తర్వాత ప్రజా సోషలిస్టు పార్టీ ద్వారా లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై, కాంగ్రెస్ అగ్రనేత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పిలుపుతో కాంగ్రెస్‌లో చేరి కీలక పదవులలో కొనసాగారు. 2017లో అనూహ్యమైన రాజకీయ పరిణామాలతో బీజేపీలో చేరారు. అయితే క్రియాశీలకంగా వ్యవహరించలేదు. మండ్య, మైసూరు, బెంగళూరులలో చదువు కొనసాగించిన ఎస్ఎం కృష్ణ అమెరికాలోనూ ఉన్నత విద్య అభ్యసించారు.

ఎస్ఎం కృష్ణ పార్థివదేహం



రోదిస్తున్న భార్య ప్రేమకృష్ణ

పదకొల కృష్ణుడు..!



ఇంటి వద్ద అభిమానుల సందడి

ఎస్ఎం కృష్ణకు ఉభయసభల నివాళి

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో అగ్రనేతగా రాణిస్తూ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కీలకమైన హోదాల్లో కొనసాగిన ఎస్ఎం కృష్ణ (92) తుదిశ్వాస వీడడంపై శాసనసభ ఉభయసభలు ఘన నివాళులు అర్పించాయి. బెళగావి సువర్ణసౌధలో రెండోరోజు మంగళవారం శాసనసభ కలాపాలు ప్రారంభం కాగానే స్పీకర్ యూటీ ఖాదర్ సంతాపసూచిక తెలిపారు. ప్రముఖ రాజకీయ నాయకుడు, ఉపముఖ్యమంత్రితోపాటు వివిధశాఖల మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా కేంద్రమంత్రిగా ఎస్ఎం కృష్ణ వ్యవహరించారని స్పీకర్ తెలిపారు. అపార అనుభవం ఉన్న రాజకీయ నేతను కోల్పోయామన్నారు. ఆరు దశాబ్దాలు రాజకీయాల్లో ఉన్నా ఎక్కడా ద్వేషం, వివాదానికి తావులేకుండా వ్యవహరించారన్నారు.



సంతాపం ప్రకటిస్తున్న సభాపతి బసవరాజ హొరట్టి

ఎస్ఎంకు అభిమానిని: సీఎం

విద్యార్థిదశలోనే తాను ఎస్ఎం కృష్ణ అభిమాని అని సీఎం సిద్దరామయ్య తెలిపారు. శాసనసభలో సంతాపసూచికలో భాగంగా 1968లో ప్రజా సోషల్ పార్టీ లోక్‌సభ సభ్యుడిగా పోటీ చేసినప్పుడు పాల్గొన్నామని గుర్తు చేసుకున్నారు. 1962లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వారన్నారు. వివిధ హోదాలలో కొనసాగారని ప్రతి పదవికి ఆయన వన్నె తెచ్చారన్నారు. 2005లో ఎస్ఎం కృష్ణ మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు ముంబైలో కలిశానని, కాంగ్రెస్‌లో చేరే ప్రస్తావన తీసుకొచ్చానన్నారు. అందుకు సాదరంగా స్వాగతించారన్నారు. బెంగళూరుకు సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా వచ్చేందుకు ఆయనే కారణమన్నారు. అనంతరం ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మాట్లాడుతూ ఎస్ఎం కృష్ణ అభివృద్ధిని రాష్ట్ర ప్రజలు ప్రత్యేకించి బెంగళూరు ఎప్పటికీ మరువదన్నారు. రాష్ట్రంలో ఆర్థికతలో 60శాతం ప్రగతికి ఆయన సేవలు అపారమన్నారు. దేశంలోనే నెంబరు వన్ ముఖ్యమంత్రిగా ఆరోజుల్లో పేరు పొందారన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ తన వ్యక్తిత్వం ద్వారానే భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమయ్యారన్నారు. టెన్నిస్ ఇష్టమని, రాజకీయాల్లోనూ క్రీడా స్ఫూర్తి కొనసాగించారన్నారు.

పరిషత్‌లోనూ సంతాపం

పరిషత్ కలాపాలు ప్రారంభం కాగానే సభాపతి బసవరాజ హొరట్టి మాట్లాడుతూ ఎస్ఎం కృష్ణ సంతాప సూచికను ప్రస్తావించారు. సభా నాయకుడు మంత్రి బోసరాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు ఎస్ఎం కృష్ణ సేవలు కొనియాడారు.

మధ్యాహ్నానికే సభలు వాయిదా

ఉభయసభలలో ఎస్ఎం కృష్ణ సంతాప నిర్ణయాలపై వివిధ పార్టీల సభ్యులు మాట్లాడారు. మధ్యాహ్నం దాకా ప్రక్రియ సాగింది. ఆ తర్వాత సభను 12వ తేదీ గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ యూటీ ఖాదర్ శాసనసభలో ప్రకటించారు. బుధవారం ఎస్ఎం కృష్ణ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సీఎం, డీసీఎంలతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతామని తెలిపారని అందుకు అనుగుణంగా కలాపాలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. పరిషత్‌లో సభాపతి బసవరాజ హొరట్టి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో శాసనసభ శీతాకాల సమావేశాలు మంగళవారం నుంచి నేరుగా గురువారానికి వాయిదాపడినట్టయ్యింది.

సుదీర్ఘంగా రాజకీయాల్లోనే..

మొత్తం 10సార్లు ఎన్నికల్లో పోటీ చేశారు. శాసనసభ ఎన్నికల్లో నాలుగుసార్లు గెలుపొంది, రెండుసార్లు ఓటమి చెందారు. నాలుగుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి మూడుసార్లు గెలుపొందారు. మద్దూరు నుంచి మూడుసార్లు, చామరాజపేట నుంచి ఒకసారి గెలుపొందారు. మండ్యలోక్‌సభ నుంచి మూడు సార్లు ఎంపీ అయ్యారు. ఒకసారి విధానపరిషత్ సభ్యుడిగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగాను కొనసాగారు. మండ్య జిల్లా నుంచి తొలి ముఖ్యమంత్రిగా ఆయన గుర్తింపు పొందారు. 2017లో కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. ఆ వెంటనే బీజేపీలో చేరారు. 2022 జనవరి 7న ఎస్ఎం కృష్ణ 60ఏళ్ల సుదీర్ఘ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు.

నేడు అంత్యక్రియలు

ఎస్ఎం కృష్ణ అంత్యక్రియలు సొంతూరు సోమనహళ్ళిలో బుధవారం నిర్వహించనున్నారు. ఎస్ఎం కృష్ణ మృతి విషయం తెలియగానే శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు బెళగావిలో ఉన్న డీసీఎం డీకే శివకుమార్ హుటాహుటిన బెంగళూరుకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు మండ్య జిల్లా సోమనహళ్ళిలో అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి చేరుకున్న డీసీఎం ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ఎం కృష్ణ పార్థివదేహాన్ని సదాశివనగర్‌లోని ఆయన నివాసం వద్దనే ఉంచారు. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ అగ్రనేత యడియూరప్ప, సమీప బంధువు మాజీ ఎంపీ రమ్య, మాజీ ఎంపీ సుమలతలు పార్థివదేహానికి నివాళులు అర్పించారు. మాజీ సీఎం వీరప్పమొయిలీ, వాటాళ్ నాగరాజ్, తేజస్విని అనంతకుమార్, ముఖ్యమంత్రి చంద్రు, అశ్విని పునీత్‌రాజ్‌కుమార్, శివరాజ్ కుమార్‌లతోపాటు పలువురు సంతాపం తెలిపారు.

కంటతడి పెట్టిన డీసీఎం


రాజకీయ గురువుగా భావించే ఎస్ఎం కృష్ణ పార్థివదేహాన్ని చూసిన వెంటనే డీసీఎం డీకే శివకుమార్ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడిపెట్టారు. ఎస్ఎం కృష్ణ సలహాలతోనే డీకే శివకుమార్ రాజకీయంగా ఎదిగారు. ప్రస్తుతం వీరిమధ్య బంధుత్వం కూడా ఉంది. ఎస్ఎం కృష్ణ కుమార్తె మాళవిక తనయుడు అమర్త్య హెగ్డేను డీకే అల్లుడిని చేసుకున్న విషయం తెలిసిందే.

మూడు రోజులు సంతాప దినాలు

ఎస్ఎం కృష్ణ మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. బహిరంగ ప్రదేశాలలో మూడు రోజులపాటు ఎటువంటి మనోరంజన కార్యక్రమాలు కొనసాగవు. ప్రభుత్వ ప్రకటన వెలువడగానే కార్యాలయాలపై ఉన్న జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సెలవు ప్రకటించారు. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు వర్తిస్తుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. సదాశివనగర్ నుంచి బుధవారం ఉదయం ఎస్ఎం కృష్ణ పార్థివదేహాన్ని మండ్య జిల్లా మద్దూరుకు తరలించనున్నారు. మార్గమధ్యంలో కెంగేరి, రామనగరలలో కొద్దిసేపు అభిమానుల సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. మద్దూరు తాలూకా సోమనహళ్ళికి పార్థివదేహాన్ని తీసుకెళ్తారు. పాఠశాల ప్రాంగణంలో కాసేపు ఉంచి ఆ తర్వాత కాఫీడే సమీపంలోని స్థలంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపనున్నారు.

ఇందిరాగాంధీ ఒక్కమాటతోనే కాంగ్రెస్‌లోకి

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా శాసనసభలోకి అడుగుపెట్టిన ఎస్ఎం కృష్ణ ప్రజాసోషలిస్టు పార్టీ ద్వారా మండ్య నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత అనూహ్యమైన సంఘటనతో ఎస్ఎం కృష్ణ కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఓసభ కొనసాగుతోంది. సభకు సంబంధించిన యాక్షన్‌ప్లాన్‌ను ప్రధాని ఇందిరాగాంధీ చదవాల్సి ఉండేది. అయితే గొంతునొప్పి ఉండడంతో ఆమె మౌనంగా సభలోని అందరివైపు చూశారు. తదుపరి ఎటువంటి సూచనలు చేస్తారని అతిథులు, ప్రముఖులు ఎదురుచూశారు. హాల్‌లో చివరన కుర్చీ లేకుండా నిలబడి ఉన్న యువ లోక్‌సభ సభ్యుడిని ఆమె గమనించారు. అతడు కూర్చునేందుకు ఎక్కడైనా స్థలం ఉందేమోనని గమనిస్తూ ఉన్నారు. అయితే సభలో ఖాళీగా ఉండేది ఒక కుర్చీ మాత్రమే. అది ప్రధాని ఇందిరాగాంధీ పక్కన ఉన్న కుర్చీ. ఏం చేయాలని అటూ ఇటూ పరిశీలిస్తూ ఇందిరాగాంధీవైపు చూశారు. అనూహ్యమో యాదృచ్ఛికమో ఇందిరాగాంధీ కూడా చూశారు. అలా కొన్ని క్షణాల్లోనూ ఇందిరాగాంధీ యువఎంపీని రావాలంటూ సైగ చేశారు. ఒక్కసారిగా ప్రధానమంత్రి చెంతకు వెళ్తున్నాననే భావనతో వెళ్లారు. పక్కన ఉండే ఖాళీ కుర్చీ చూపి కూర్చోవాలని సైగ చేశారు. ఆ తర్వాత కార్యక్రమానికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్ వివరాలను చదవాలంటూ సూచించారు. దేశ ప్రధాని ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించారు. సభ సజావుగా జరగడమే కాకుండా అతడి భాష, పరిజ్ఞానం సభ నిర్వహించిన తీరు ప్రధాని ఇందిరాగాంధీతోపాటు సభికులను మంత్రముగ్ధులను చేసింది. సభ ముగిశాక ఓ చీటీలో 'కమ్ అండ్ మీట్ మి' అని రాసి కాగితాన్ని ఇచ్చారు. స్వయంగా ప్రధాని పిలుపుతో చాంబర్‌కు వెళ్లి భేటీ అయ్యారు. అప్పటికి గొంతు నొప్పి కాస్త ఉపశమనం కావడంతో యువ ఎంపీ వివరాలను ఆరాతీశారు. తన పేరు ఎస్ఎం కృష్ణ అని, కర్ణాటక రాష్ట్రం మండ్య లోక్‌సభ నుంచి ప్రజాసోషలిస్టు పార్టీ నుంచి ఎన్నికైనట్లు వివరించారు. ఆ పార్టీలో ఏం చేస్తావు... కాంగ్రెస్‌లోకి వచ్చేయ్ అంటూ ఆహ్వానించారు. అయితే ప్రజాసోషలిస్టు పార్టీ నేతల అభిప్రాయం తీసుకోవాల్సి ఉందని వివరించారు. అందుకు ప్రధాని ఇందిరాగాంధీ సమ్మతించారు. అయితే ప్రజాసోషలిస్టు పార్టీ మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరేందుకు సమ్మతించలేదు. ఇదే విషయాన్ని మరోసారి ప్రధాని ఇందిరాగాంధీని కలసి వివరించారు. వారంతా రాలేదంటే నీవు ఒక్కడివే కాంగ్రెస్‌లోకి రావచ్చునని ఆహ్వానించారు. ఇలా ఇందిరాగాంధీ ప్రధాని హోదాలో పిలుపుతో కాంగ్రెస్‌లోకి చేరిన ఎస్ఎం కృష్ణ రాష్ట్ర ఆర్థికమంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ముఖ్యమంత్రిగా గవర్నర్‌గా కేంద్రమంత్రిగా పనిచేసే అవకాశాన్ని పొందారు.



ప్రధాని ఇందిరాగాంధీతో ఎస్ఎం కృష్ణ, రాజ్‌కుమార్ (ఫైల్)

వివిధ హోదాల్లో ఎస్ఎం కృష్ణ

- 1962లో తొలిసారి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
- 1968లో ప్రజా సోషలిస్టు పార్టీ తరపున లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- 1972లో కేంద్రమంత్రిగా కొనసాగారు.
- 1989 నుంచి 1992 వరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు.
- 1992 నుంచి 1994వరకు వీరప్పమొయిలీ కేబినెట్‌లో డీసీఎంగా పని చేశారు.
- 1999లో కేపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతూనే ఎన్నికల్లోకి వెళ్లగా 132 స్థానాల్లో గెలుపు సాధించారు. దీంతో 1999 నుంచి 2004 వరకు సీఎంగా కొనసాగారు.
- 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు.
- 2004 నుంచి 2008 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా కొనసాగారు.
- మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు.



డాక్టర్ రాజ్‌కుమార్‌తో ఎస్ఎంకే



నటుడు అంబరీశ్‌తో...



నారా చంద్రబాబు నాయుడుతో ...



తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం

ఉషస్సు నింపిన సంధ్య



డాక్టర్ సంధ్య (ఫైల్)

అవయవ దానంతో బాధితుల జీవితాల్లో వెలుగులు

మరణంలోనూ మానవత్వం చాటిన వైద్యురాలు

7

అడ్డుకున్నా తరలివచ్చారు..

- బెళగావికి పోటెత్తిన పంచమశాలీలు
- హింసాత్మకంగా మారిన రిజర్వేషన్ల పోరాటం

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచమశాలిలకు 2ఏ రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో జరిగిన పోరాటం హింసాత్మకతకు దారితీసింది. మంగళవారం సువర్ణసౌధ ముట్టడికి ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన పంచమసాలిలు సిద్ధం కావాలని నిర్ణయించారు. ఇందుకోసం నిరంతరంగా కార్యాచరణ జరిపారు. సోమవారం జిల్లా అధికారితో చర్చలు జరిగాయి. 10వేల ట్రాక్టర్లతో నిరసనకు జిల్లా యంత్రాంగం అంగీకరించలేదు. అయితే ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన అన్ని జిల్లాలనుంచి పంచమశాలిలు సోమవారం మధ్యాహ్నం నుంచే చలో సువర్ణసౌధకు సిద్ధమయ్యారు. మంగళవారం ఉదయం అయ్యేసరికి పెద్ద ఎత్తున సువర్ణసౌధ ప్రాంగణానికి చేరుకున్నారు. కానీ బెళగావి శివారు ప్రాంతాల్లోనే ట్రాక్టర్లను కట్టడి చేశారు. మరోవైపు అన్ని జిల్లాల్లోనూ ట్రాక్టర్ల ర్యాలీ నిలుపుదల చేశారు. అయినా వేలాది మంది పంచమశాలిలు చేరుకున్నారు. వీరికి మద్దతు ఇచ్చేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర రాగా కొందరు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ వేదికపైకి రాగా పులి... పులి... అంటూ నినాదాలు చేశారు. సువర్ణసౌధలోకి దూసుకెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో లాఠీచార్జ్ చేశారు. సుమారు 20మందికి గాయాలయ్యాయి. వివాదం కాస్త ఉద్రిక్తంగా మారడంతో నిరసనకు నేతృత్వం వహించిన బసవమృత్యుంజయ స్వామీజీ, ఎమ్మెల్యే యత్నాళ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నిరసనలో మాట్లాడుతున్న బసవ మృత్యుంజయస్వామీజీ

వైభవంగా జోడు రథోత్సవాలు

- 8లో



జోడు రథాలను లాగుతున్న భక్తులు




పాముతో ఆట్లాడుతున్న మందుబాబు

కిక్కులో తిక్క పని

నాగుపాముతో మందుబాబు ఆటలు..!

అనంతపురం నగర శివారుల్లోని టీవీ టవర్ సమీపంలో ఓ మందుబాబు నాగుపాముతో ఆటలాడుతూ హల్‌చల్ చేశాడు. కదిరి-అనంతపురం హైవే పక్కన కూర్చొని పామును చేతిలో పట్టుకోవడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. పాము పడగ విప్పగా చేత్తో అటూ ఇటూ ఆడిస్తూ పట్టుకున్నాడు. మెడలో వేసుకుని అటూ ఇటూ తిరిగాడు. దగ్గరకు వస్తే పాము విసిరేస్తానంటూ స్థానికులను భయపెట్టాడు. అయినా ఆ పాము ఇతడిని కాటు వేయకపోవడం గమనార్హం. ఇంతలో కొంత మంది మందుబాబును మందలించి పామును సమీపంలోని చెట్లపొదల్లోకి విడిచి పెట్టేలా చేయించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురంరూరల్

మధ్యాహ్న భోజనం సూపర్

రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం మంచి నాణ్యతతో ఉందని రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. ఆయన మంగళవారం తాడిపత్రి, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేశారు. స్థానిక త్రిబుల్‌ఎస్ ఎంఆర్‌ఎంలో మధ్యాహ్న భోజనంలోని అన్నం, పప్పు, రసం, చిత్రాన్నం, పులిహోర, పెరుగన్నం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు. అనంతరం నాణ్యత తదితర అంశాలపై ఆరాతీశారు. ఇంత నాణ్యమైన భోజనాన్ని మెను ప్రకారం ఇవ్వడం చాలా గ్రేట్ అని కితాబిచ్చారు. మధ్యాహ్నభోజనాన్ని ఎవరు చేయిస్తున్నారని ఆరాతీయగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శైలజాసేవాట్రస్ట్ నిర్వాహకుడు అరవింద నారాయణరెడ్డి ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇంత నాణ్యమైన భోజనం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. అనంతరం అరవింద నారాయణరెడ్డి ఇంటివద్దకు వెళ్లి ముందు ముందు కూడా ఇలాగే చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. అంతకుమునుపు జయనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న జూటూరుకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, చుక్కలూరు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు చుక్కలూరు హైస్కూల్‌ను తనిఖీచేసి భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ నాగరాజు, సివిల్‌సప్లై అధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



చిత్రాన్నం తింటున్న ఫుడ్ కమిటీ చైర్మన్



డివిజనల్ ఆర్ఎంఎస్ ప్రధాన కార్యాలయం

ఆమరణ దీక్షకు సిద్ధం



"బ్రిటిష్ పాలనా కాలం నుంచి గుంతకల్లులో ఆర్ఎంఎస్ సేవలందిస్తోంది. అలాంటి ఆర్ఎంఎస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం. పార్శిల్, స్పీడ్, రిజిస్టర్ వేరు వేరు కంపెనీలా తయారు చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తోంది. ఆర్ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగించాలి లేదంటే ఆమరణ దీక్ష చేస్తాం.

-నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు

ఇక గతమే...!

రైల్వే మెయిల్ సర్వీస్ తరలింపునకు యత్నం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో అతి పెద్ద రైల్వే మెయిల్ సర్వీస్(ఆర్ఎంఎస్)కార్యాలయాన్ని గుంతకల్లు నుంచి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. రైళ్ల ద్వారా పార్శిళ్లు, ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేయడానికి గుంతకల్లులో 1960లో రైల్వే మెయిల్‌సర్వీసు కార్యాలయం ఏర్పాటు చేశారు. అరవై ఏళ్ల పైబడిన చరిత్ర ఉన్న గుంతకల్లు రైల్వే మెయిల్ సర్వీస్‌ను అనంతపురం, కర్నూలుకు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గుంతకల్లు నుంచి స్పీడ్, రిజిస్టర్, అన్‌రిజిస్టర్, బిజినెస్, వార పత్రికలు, మ్యాగ్జైన్‌లను ముంబై, బెంగళూరు, చెన్నై రాష్ట్రాలకు పంపేవారు. కేవలం స్పీడ్ పోస్టు సాకుగా చూపి ఇక్కడ ఉన్న సర్వీస్ కార్యాలయాన్ని తరలించేందుకు యత్నిస్తున్నారు. గతంలో రోజు వందమంది సిబ్బంది పనిచేసేవారు. పని ఎక్కువగా ఉన్న, స్థలంలో లేకున్న రైల్వే ప్లాట్‌ఫాంలోనే ఉత్తరాలు పెట్టుకుని పనిచేసేవారు. మోదీనబాదులో 8 ఎకరాల స్థలంలో రైల్వే మెయిల్ సర్వీసు కార్యాలయం, క్వార్టర్స్‌లు ఉన్నాయి. మరిన్ని భవనాలు నిర్మించుకునేందుకు ఖాళీ స్థలం ఉంది. వంద మంది రెగ్యులర్, వంద మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్యాలయం ఇతరప్రాంతాలకు తరలిస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇక్కడే స్పీడ్ పోస్టు సౌకర్యం కల్పిస్తే సర్వీస్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

గుంతకల్లు నుంచి అనంతపురం, కర్నూలుకు..

ఇక్కడే కొనసాగించాలని ఉద్యోగులు అభ్యర్థన



గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలో ఆర్ఎంఎస్ కార్యాలయం

పోస్టల్ స్టోర్ డిపో మూసివేత

పట్టణంలోని పాత ఐటీసీ డిపో వద్ద ఉన్న పోస్టల్ స్టోర్ డిపో ద్వారా రాయలసీమ పరిధిలో అన్ని పోస్టాఫీసులకు స్టేషనరీ సప్లై చేసేవారు. జూన్ 1, 2021లో స్టోర్ డిపోను మూసివేశారు. ప్రస్తుతం విజయవాడ నుంచి స్టేషనరీ సరఫరా చేస్తున్నారు. అలాగే పదేళ్ల కిందట సూపరింటెండెంట్ కార్యాలయం మూసివేశారు. ప్రస్తుతం స్పీడ్ పోస్టులో విలీనం చేసి రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయాన్ని మూసివేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆర్ఎంఎస్‌ను అభివృద్ధి చేస్తాం

ఆర్ఎంఎస్ బలాన్ని గుర్తించకుండా, బలహీనతను గుర్తించి ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదు. గుంతకల్లులో ఎంతో చరిత్ర కలిగిన ఆర్ఎంఎస్‌కు చరమగీతం పాడడానికి పూనుకోవడం దారుణం. ఇతరప్రాంతాలకు తరలిస్తే మా కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆర్ఎంఎస్‌ను ఇక్కడే కొనసాగిస్తే మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

- ప్రవల్లిక, ఆర్ఎంఎస్ ఉద్యోగి



నాకేం తెలియదు

- అగ్రిగోల్డ్ భూముల విషయంపై తహసీల్దార్
- ఆస్తులను 'దున్నేస్తున్న' వైసీపీ నాయకుడు
- కార్యాలయంలో ఓ అధికారితో డీల్

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్యనున్న అగ్రిగోల్డ్ భూముల విషయం గురించి తనకు ఏమి తెలియదని తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం ఫోన్‌లో వివరణ ఇచ్చారు. అగ్రిగోల్డ్ విషయమా? నాకు ఏమి తెలియదు. ఆఫీసులో ఎవరు చూసుకుంటున్నారో కూడా తెలియదని సమాధానం ఇచ్చారు. ఆ గ్రామంలో వందల ఎకరాల్లో భూములు ఉన్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఆ భూములను సీజ్ చేసినట్లు కూడా తనకు తెలియదని ఆయన పలువురు వీఆర్వోల వద్ద ఆవేదన వెల్లగక్కినట్లు తెలిసింది. మండలానికి కొత్తగా వచ్చానని అలాంటి విషయాలు నాకు ఎలా తెలుస్తాయంటూ చెప్పారు. మండలంలో కడవకల్లు గ్రామంలో ఓ వైసీపీ నాయకుడు వంద ఎకరాలకు పైగా ఆక్రమించుకుని సాగు చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న విషయం తెలిసిందే. ఇదంతా తెలిసిన అధికారులు ఇప్పటివరకు ఏమీ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



రూ.20లక్షల పరికరాలు మాయం

అగ్రిగోల్డ్ భూముల్లో ఉపయోగించిన యంత్రాలు, పరికరాలు తదితర సామగ్రి విలువ రూ.20లక్షలకు పైనే ఉంటుందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. రెండు ట్రాక్టర్లు, వందలాది మీటర్ల డ్రిప్పు వైర్లు, వేలాది మీటర్ల కంచె తదితర సామగ్రిని సైతం ఆ వైసీపీ నాయకుడే సుమారు రూ.20లక్షలకు పైగానే అమ్ముకున్నట్లు సమాచారం. వీటితో పాటు వంద ఎకరాల్లోపు అరటి, మొక్కజొన్న, దానిమ్మ తదితర పంటలు సాగుచేసుకుంటూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అగ్రిగోల్డ్‌లో ఉన్న లక్షలాది రూపాయల భవంతులను సైతం ఆ వైసీపీ నాయకుడు లీజుకు ఇచ్చుకుంటూ లబ్ధి పొందుతున్నాడు. ఇదంతా తెలిసిన రెవెన్యూ అధికారులు మాకెందుకులే ఆ నాయకుడి గురించి అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



అగ్రిగోల్డ్ భూమి ప్రధాన ముఖద్వారం

అధికారులకు వాటా ముట్టిందా?

అగ్రిగోల్డ్ భూముల విషయంలో ఆ వైసీపీ నాయకుడు అధికారులకు వాటా ముట్టచెప్పాడన్న ఆరోపణలు కడవకల్లు గ్రామంలో వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కనీసం ఆ ప్రాంతాన్ని ఏ ఒక్క అధికారి తనిఖీచేసిన పాపాన పోలేదు. ఆ వైసీపీ నాయకుడు నేరుగా పుట్లూరులోని తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారి దగ్గరకు వెళ్లి నేరుగా డీల్ చేశాడన్న విమర్శలు ఉన్నాయి. తనకు టీడీపీ నాయకుల అండ ఉంది ఎవరు ఏమిచేయలేరు అంటూ పలువురు వీఆర్వోల దగ్గర చెబుతున్నట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారికి పెద్దమొత్తంలో ఆమ్యామ్యాలు ముట్టచెప్పినట్లు సమాచారం.

సంక్రాంతికి పనులు పూర్తి కావాలి

ప్రతి హాస్టల్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టరు ఆదేశం



అనంతపురం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల నిర్మాణాలు, మరమ్మతు పనులు సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వసతిగృహాల ప్రగతి పనులపై మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 11 హాస్టళ్లకు డిస్ట్రిక్ జనరల్ ఫండ్ కింద రూ1.12కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటికే 10హాస్టళ్లలో పనులు పూర్తి చేశారని మిగిలిన ఒక్కహాస్టల్లోనూ పనులు త్వరగా ముగించాలన్నారు. మరోవైపు ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.5.70కోట్లతో 36 హాస్టళ్లకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉందని వెల్లడించారు. ఈపనులన్నీ ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు. ప్రతి వసతిగృహంలోను తప్పనిసరిగా సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీఈడబ్ల్యుఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఈపనులన్నీ పూర్తి చేయించాలన్నారు. అన్ని వసతిగృహాలలో రెండురోజుల్లోగా ట్యూటర్లను నియమించుకోవాలన్నారు. సంక్రాంతి పండుగలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభోత్సవాలు చేపట్టాలని కలెక్టరు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈపనుల విషయంలో ఎవరు ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ డీడీ ప్రతాప్ ఎసూర్యనారాయణరెడ్డి, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

యాడికిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



ఫీల్డ్‌లోకి తమ్ముళ్లు..?

ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకంలో టీడీపీ నాయకుల దందా

ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయం

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో కొందరు టీడీపీ నాయకులు దందా చేసినట్లు చర్చ జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో వైసీపీ పాలన నుంచి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇప్పటికీ అలాగే పని చేస్తున్నారు. వారిని తొలగించి టీడీపీ వర్గీయులను నియమించుకోవాలని టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంపై దందా మొదలుపెట్టినట్లు చర్చ జరుగుతోంది. మా గ్రామపంచాయతీలో మాకు తెలియకుండా మీరెలా పేర్లను ప్రతిపాదిస్తారు? పైగా పోస్టులను మీరు అమ్ముకొని సొమ్ము చేసుకుంటారా అని గ్రామాల్లోని నాయకులు ఆగ్రహంతో ఉన్నారు.

చేతులు మారుతున్న లక్షలు..?

చిక్కేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి, కొత్తగా టీడీపీలోకి వచ్చిన, వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారంటూ సీనియర్ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో రూ.2.5లక్షలు చేతులు మారినట్లు చర్చించుకుంటున్నారు. ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నట్లు సమాచారం. కమలపాడు గ్రామ పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకానికి రూ.4లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిట్టూరు గ్రామ పంచాయతీకి సంబంధించి ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేయాలని, వేతనాలు పెట్టకుండా అధికారులచే టీడీపీ నాయకులు వేధిస్తున్నట్లు ఉపాధిహామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. యాడికిలో ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూడా నువ్వు రాజీనామా చేయాలి మావాళ్లను ఎక్కించుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అతను రాజీనామా చేయకపోయేసరికి అధికారులతో నోటీసులు ఇప్పించారని, దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ హైకోర్టుకు వెళ్లినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఎంపీడీఓకు హైకోర్టు నుంచి నోటీసులు వచ్చినట్లు సమాచారం. 'నాయకులు బలవంతంగా చేయిస్తున్న పనికి కోర్టుకు తాము వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇదేమి మండలమో ఏమో' అని అధికారులు చిరుబుర్రులాడుతున్నారు. కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న పనికి ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు వస్తున్నట్లు మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బోగస్ మస్టర్లు తయారు చేసేలా కొందరు టీడీపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. లారీ డ్రైవర్లను ఉపాధి కూలీలుగా నమోదుచేసి పనులకు రాకపోయినా లబ్ధి చేకూరేలా చేస్తున్నా రని ఇలాంటి పేర్లు ఇప్పటికే వందల సంఖ్యలో నమోదు చేయించారని ఉపాధి హామీ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, నియామకం వ్యవహారంపై ఉపాధిహామీ పథకం ఏపీఓ రమేష్‌ను వివరణ కోరగా ఇందులో తనకేమి సంబంధం లేదని, ఇదంతా ఎంపీడీఓ పరిధిలోనే ఉంటుందని తెలిపారు.



వ్యవసాయ మార్కెట్ పాలకుల కోసం

కసరత్తు..!

అనంతపురంరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కార్పొరేషన్లకు సంబంధించిన నామినేటెడ్ పోస్టులు ఒక్కొక్కటిగా భర్తీ చేస్తున్నారు. ఈక్రమంలోనే మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆ మేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఇటీవల ఆదేశాలు అందాయి. ఈ క్రమంలోనే శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లాలోని మార్కెటింగ్ శాఖ అధికారులకు కమిటీ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిగా చేపట్టాలని సూచనలు జారీ చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లాలోని 9మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను ప్రభుత్వానికి అధికారులు నివేదించనున్నారు. ఆతరువాత కమిటీలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఆలస్యంగా గుంతకల్లు-బోధన్ రైలు



గుంతకల్లు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లో జరుగుతున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా గుంతకల్లు-బోధన్ (నం. 07671) ప్యాసింజరు ప్రత్యేక రైలును ఆలస్యంగా నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18, 25 తేదీల్లో ఈ రైలును మూడు గంటలపాటు ఆలస్యంగా నడపనున్నట్లు తెలియజేశారు.



అర్హులందరికీ ఇళ్లు

జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ శైలజ



అనంతపురం సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలందరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)-2 కింద ఇళ్లు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ శైలజ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అర్హులను గుర్తించేందుకు డిమాండ్ సర్వేను చేస్తున్నామన్నారు.

- **ప్రశ్న: ప్రభుత్వ ఇల్లు కావాలంటే అర్హతలు ఏవి..?**

జవాబు: ఇల్లు కావాల్సిన వారికి స్థలం పట్టా, డాక్యుమెంట్స్, నివాస ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఒకటి ఉండాలి. వీటితో పాటు తెల్లరేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఎన్‌పీసీఐ లింక్ కలిగిన ఏదైనా అకౌంట్‌తో పాటు ఏడాదికి వారి కుటుంబ ఆదాయం రూ. 3లక్షలులోపు ఉండాలి. గతంలో ప్రభుత్వ పథకం కింద ఇల్లు పొంది ఉండరాదు.

- **డిమాండ్ సర్వే ఎలా చేస్తారు..?**


జవాబు : ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ప్రకారం ఒక యాప్ ద్వారా డిమాండ్ సర్వే చేసి అర్హులను గుర్తించమని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామ స్థాయిలో హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినిటీస్ ద్వారా ఇంటింటా డిమాండ్ సర్వే చేసి యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను అప్‌లోడ్ చేస్తే వారు అర్హులా..? కాదా..? అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది.

- **ప్రశ్న: స్థలం ఉన్నవారికేనా ఇల్లు..?**

జవాబు: ప్రస్తుతానికి ప్రభుత్వ అదేశాలు ప్రకారం సొంత స్థలం కలిగిన వారి జాబితా మాత్రమే గుర్తించి అర్హులను ఎంపిక చేయమని ప్రభుత్వం అదేశించింది. ఆ దిశగా సర్వే చేస్తాం. స్థలంతో ఇల్లు మంజూరు విషయంపై ప్రభుత్వం ఇంకా అదేశాలు జారీ చేయలేదు.

ప్రశ్న: ఈ సర్వే ఎప్పటి నుంచి ప్రారంభమైంది..?

జవాబు: గత పది రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించాం. నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగుతుంది. తరువాత అర్హులైన వారందరికి వచ్చే మార్చి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలయ్యే పీఎంఏవై-2 పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తాం.



కణేకల్లు వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

నానాటికీ తీసికట్టు..!

- కూలుతున్న హెచ్చెల్సీ వంతెనలు
- ఆధునికీకరణ పట్టని ప్రభుత్వాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

కణేకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో హెచ్చెల్సీ పరిస్థితి నానాటికి దిగజారుతోంది. కాలువకు అనుబంధంగా ఉన్న అనేక వంతెనలు, కల్వర్టులు కుప్పకూలుతున్నాయి. దీంతో రానున్న కాలంలో హెచ్చెల్సీ పరిస్థితిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూలిన ఐదు వంతెనలు

గత రెండేళ్ల నుంచి హెచ్చెల్సీపై ఐదు కల్వర్టులు కుప్పకూలాయి. అందులో 165 కి.మీ. వద్ద ఉన్న బిదురకుంతం కల్వర్టు, 171 కి.మీ. వద్ద ఉన్న హోన్నూరు కల్వర్టు, 113 కి.మీ. వద్ద ఉన్న నాగలాపురం వంతెనతో పాటు 147 కి.మీ. వద్ద ఉన్న కణేకల్లులో శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద ఉన్న వంతెన, 155 కి.మీ. వద్ద ఉన్న నాగేపల్లి వంతెన ఉన్నాయి. ఇవి కూలిపోవడంతో ఆయా గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నాగేపల్లి వద్ద కూలిన హెచ్చెల్సీ కల్వర్టు

కూలేందుకు సిద్ధం

మాల్యం వద్ద ఉన్న ప్రధాన హెచ్చెల్సీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందోనన్న పరిస్థితి ఏర్పడింది. అనేక ఏళ్లుగా ఈ బ్రిడ్జి గురించి పాలకులకు, అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా నిధులు లేవన్న కారణంతో మరమ్మతులు చేయలేదు. హెచ్చెల్సీ అక్విడెక్ట్ పరిస్థితి కూడా ఇబ్బంది కరంగా మారింది. అక్విడెక్ట్‌లోని పలు ప్రాంతాల నుంచి రాళ్లు పోవడంతో పెద్ద పెద్ద లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా బయటకు వెళ్తోంది. దీంతో ఇప్పటికే అధికారులు అక్విడెక్ట్‌పై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం హెచ్చెల్సీని నిర్లక్ష్యం చేసింది. మరమ్మతులకు ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో రైతులే దర్గాహోన్నూరు వద్ద కూలిన వంతెనను చందాలు వేసుకుని బాగు చేసుకున్నారు. మరమ్మతు పనుల కోసం అధికారులు గత ఐదేళ్లలో పలుసార్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది. 12 ఏళ్ల క్రితం ఆధునికీకరణ పనుల కోసం నాటి ప్రభుత్వం విడుదల చేసిన రూ.310 కోట్ల నిధులు తప్ప మరలా ఎలాంటి నిధులు రాకపోవడంతో హెచ్చెల్సీ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులపై శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేయడంతో పాటు అత్యవసరంగా చేయాల్సిన మరమ్మతులను చేయించాలని రైతులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా మాల్యం బ్రిడ్జి



మాల్యం వద్ద ఉన్న హెచ్చెల్సీ ప్రమాదకరంగా ఉంది. బ్రిడ్జికు సంబంధించిన పిల్లర్ల రాళ్లన్నీ ఊడిపోయాయి. ఈ బ్రిడ్జిపైనే కణేకల్లు నుండి ఉరవకొండతో పాటు అనేక గ్రామాలకు వెళ్లే బస్సులు, ఇతరత్రా వాహనాలు ప్రయాణించాల్సి ఉంది. అనుకోని సంఘటనలు జరిగితే భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది.

- గురుస్వామి, రైతు, మాల్యం

రూ.36 కోట్లకు ప్రతిపాదనలు: మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈ



హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో అత్యవసర పనుల కోసం రూ. 36 కోట్లకు ప్రతిపాదనలు పెట్టాం. ఇందులో నాగలాపురం, నాగేపల్లి, హోన్నూరు, గెణిగెరతో పాటు ఆరు వంతెనలు, నాలుగు ఎస్కేప్ రెగ్యులేటర్లు ఉన్నాయి. ఇప్పటికే ఆధునికీకరణ పనులలో ఈ వంతెనలకు సంబంధించి పిల్లర్లు సిద్ధంగా ఉన్నాయి. వాటిపై మిగతా పనులు పూర్తి చేస్తే అవి అందుబాటులోకి రానున్నాయి. నిధులు మంజూరై కాలువలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే ఆధునికీకరణలో భాగంగా చేసి వదిలేసిన మిగతా పనులను పూర్తి చేయాలంటే దాదాపు 600 కోట్లు అవసరమవుతుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సుబ్రమణ్యభారతి (జయంతి)



భారతీయార్‌గా చిరపరిచితులైన సుబ్రమణ్యం భారతి 1882 డిసెంబరు 11న ఎట్టాయపురంలో జన్మించారు. తమిళ రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త. ఆధునిక తమిళ సాహిత్యానికి మార్గదర్శిగా, మహాకవి భారతిగాను సుప్రసిద్ధులు. సంస్కృతం, హిందీ, తెలుగు, ఆంగ్లం, ఫ్రెంచ్, అరబ్బీ భాషల్లో అపార పాండిత్యం సంపాదించారు. 11ఏళ్ళ ప్రాయంలోనే ఆయన 'భారతి' బిరుదును సొంతం చేసుకోవడం విశేషం. 38వ ఏట 1921 సెప్టెంబరు 22న ఆయన కన్నుమూశారు.

దిలీప్‌కుమార్ (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత దిలీప్ కుమార్ 1920 డిసెంబరు 11న ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మొహ్మద్ యూసుఫ్ ఖాన్. సినిమాల కోసం పేరును మార్చుకున్నారు. అత్యధిక పురస్కారాలు పొందిన భారతీయ నటుడిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. ఎనిమిదిసార్లు ఫిలింఫేర్ పురస్కారం పొందిన ఆయన హిందీ సినీ రంగంలో ట్రాజెడీ కింగ్‌గా పేరొందారు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం పొందారు. 98వ ఏట 2021 జూలై 7న కన్నుమూశారు.

ఓషో రజనీష్ (జయంతి)



ప్రపంచవ్యాప్తంగా 'ఓషో రజనీష్'గా గుర్తింపు పొందిన చంద్ర మోహన్ జైన్ మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉదయ్‌పూర్ తాలూకా కుచ్‌వాడా గ్రామంలో 1931 డిసెంబరు 11న జన్మించారు. గొప్ప ఆధ్యాత్మిక గురువుగా కోట్లాది మంది భక్తులను సంపాదించుకున్నారు. ఓషో అన్ని మతాలకు సంబంధించిన ధర్మ గ్రంథాలపై అనర్గళంగా ప్రసంగించేవారు. అంతర్జాతీయస్థాయిలో ఓషో సంస్థ సేవలు నేటికీ బహుళ ప్రాచుర్యం పొందుతున్నాయి. ఆయన జీవితంపై డాక్యుమెంటరీలు, సినిమాలు రూపొందాయి. ఆయన బోధనలు పాశ్చాత్యదేశాలలో కొత్త ఒరవడి సృష్టించాయి. 1990 జనవరి 19న కన్నుమూశారు.

ప్రణబ్ ముఖర్జీ (జయంతి)



దేశ 13వ రాష్ట్రపతిగా వ్యవహరించిన 'భారతరత్న' గ్రహీత ప్రణబ్ ముఖర్జీ 1935 డిసెంబరు 11న బెంగాల్‌లో జన్మించారు. 2012 నుంచి 2017 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. ఐదుదశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్రను పోషించి పలు ఉన్నత పదవులను అలంకరించారు. దేశంలోని అత్యుత్తమ పార్లమెంటేరియన్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆర్థిక, విదేశీ వ్యవహారాలు, డిఫెన్స్ మంత్రిగా, లోక్‌సభ, రాజ్యసభలలో అధికారపార్టీనేతగా, ప్లానింగ్ కమిషన్ అధ్యక్షుడిగా కొనసాగారు. 2020 ఆగస్టు 31న ఆయన కన్నుమూశారు.

ఎంఎస్ సుబ్బులక్ష్మి (వర్ధంతి)



'భారతరత్న' అందుకున్న తొలి సంగీత కళాకారిణి మదురై షణ్ముఖ వడివు ఎంఎస్ సుబ్బులక్ష్మి 1916 సెప్టెంబరు 16న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. ఆమె ఆలపించిన భజగోవిందం, విష్ణు సహస్రనామం, వెంకటేశ్వర సుప్రభాతం వంటివి ప్రపంచవ్యాప్తంగా బహుళ ప్రజాదరణ పొందాయి. రామన్ మెగసెసే పురస్కారం అందుకున్న తొలి భారతీయ సంగీత కళాకారిణి, ఐక్యరాజ్య సమితిలో సంగీత కచేరీ నిర్వహించిన తొలి భారతీయ కళాకారిణిగా ఘనత సాధించారు. టీటీడీ ఆస్థాన విద్వాంసురాలిగా సేవ లందించారు. 200కు పైగా చారిటీ కార్యక్రమాలు అందించారు. 2004 డిసెంబరు 11న ఆమె కన్నుమూశారు.

పండిట్ రవిశంకర్ (వర్ధంతి)



సితార్ అంటే పండిట్ రవిశంకర్ గుర్తుకొచ్చేలా పేరొందిన ఆయన బెంగాల్‌లో 1920 ఏప్రిల్ 7న జన్మించారు. అసలు పేరు రవీంద్ర శంకర్ చౌదరి. 20వ శతాబ్దంలో సితార్‌తో సంగీత ప్రియులను ఓలలాడించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, అత్యున్నత 'భారతరత్న' పురస్కారం అందుకున్నారు. పేరొందారు. 1970 నుంచి 1980 వరకు ప్రపంచవ్యాప్తంగా పర్యటించి భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఎంతో వన్నెతెచ్చారు. ప్రతిష్ఠాత్మక గ్రామీ పురస్కారం అందుకున్నారు. 2012 డిసెంబరు 11న కన్నుమూశారు.

దేవదత్ పట్టనాయక్ (పుట్టినరోజు)



ప్రఖ్యాత రచయిత, వక్త దేవదత్ పట్టనాయక్ 1970 డిసెంబరు 11న ముంబైలో జన్మించారు. మైథాలజీపై ఆయన పెక్కు రచనలు చేశారు. మహాభారతం, రామాయణం వంటి గ్రంథాల సారంతో మానవ వనరులను ఏవిధంగా తీర్చిదిద్దుకోవచ్చునో ప్రయోగాత్మకంగా చూపించారు. కాల్పనిక కథలు, ఊహాచిత్రాలతో ఆకట్టుకున్నారు. రేడియో కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ ఆంగ్ల పత్రికలలో కాలమిస్ట్‌గా ఉన్నారు.

స్కేట్‌బోర్డింగ్‌లో జాతీయస్థాయి బృందం సందడి

చింతామణి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని అంజని లేక్ వుడ్స్ లే అవుట్‌లని అంతర్జాతీయ స్థాయి స్కేట్‌బోర్డింగ్ క్రీడామైదానంలో జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారుల బృందం ఆటలు ఆడి సందడి చేశారు. స్కేట్‌బోర్డింగ్ క్రీడ ప్రస్తుతం ఒలింపిక్ క్రీడగా ఉంది. బెంగళూరులో ఆదివారం జరిగిన జాతీయస్థాయి ఒలింపిక్స్ స్కేట్ బోర్డింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు సోమవారం చింతామణికి విచ్చేసి ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించారు. క్రీడాకారులను, నిర్వాహకులను ప్రజలు అభినందించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మణిపుర, కర్ణాటక, మణిపుర, కర్ణాటక, అమెరికాల నుంచి వచ్చిన స్కేట్ బోర్డింగ్ క్రీడాకారుల ప్రతిభకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. క్రీడాకారులందరికీ జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. తొలిసారిగా జరిగిన పోటీలను మాజీ మంత్రి చౌడరెడ్డి, భార్య శాంతమ్మ, మంత్రి సుధాకర్ భార్య స్వప్న, ప్రముఖులు మునిశామిరెడ్డి, నగరసభ అధ్యక్షుడు జగన్నాథ్, చింతామణి డీఎస్పీ మురళీధర్, రూరల్ సీఐ శివరాజ్, కెంచార్లహళ్ళి ఎస్సై వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు. స్కేట్‌జామ్ బోర్డింగ్ తయారు చేసిన 100ర్యాం స్కేట్‌పార్క్స్ కంపెనీ బెంగళూరుకు చెందిన డ్యారియస్, తరుణ్ బృందం వీక్షించారు.



జాతీయ బృందం



స్కేట్ బోర్డింగ్ మైదానం



స్కేటింగ్ చేస్తూ..

కరాటేతో ఆత్మరక్షణ, ఆరోగ్యం

» బ్లాక్‌బెల్ట్ ప్రదానోత్సవంలో డాక్టర్ కిశోర్

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మరక్షణే కాకుండా ఆరోగ్యం కూడా సాధ్యమని ఇండియా ఆయుర్వేద ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సీఏ కిశోర్ అభిప్రాయపడ్డారు స్కూల్ ఆఫ్ ఇండియన్ కరాటే ఆధ్వర్యంలో గ్రాండ్‌మాస్టర్ సురేశ్ ఎస్ రావ్ నేతృత్వంలో శిక్షణ పొందినవారికి బ్లాక్‌బెల్ట్‌లతోపాటు అవార్డుల ప్రదానం జరిగింది. ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు హరిప్రసాద్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. సురేశ్ ఎస్ రావ్ మాట్లాడుతూ 45ఏళ్లుగా కరాటే శిక్షణలు కొనసాగిస్తున్నామన్నారు. చిన్నారులలో ధైర్యం, మెళకువలు నేర్పడంతోపాటు కరాటే ద్వారా జాతీయ అంతర్జాతీయస్థాయిలో రాణించేలా శిక్షణలు ఇస్తున్నామన్నారు.



కరాటే క్రీడాకారులతో ప్రముఖులు, సభికులు



వేదికపై గ్రాండ్‌మాస్టర్ సురేశ్ ఎస్ రావ్, డాక్టర్ కిశోర్ తదితరులు

ఉషస్సు నింపిన సంధ్య

» అవయవదానంతో స్ఫూర్తిదాయకం

బంగారపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బైక్ ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ సంధ్యా (25) అవయవదానం చేయడం ద్వారా మరణంలోనూ మానవత్వం చాటుకున్నారు. కోలారు జిల్లా బంగారపేట తాలూకా బూదికోటె గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 11నెలలుగా వైద్యాధికారిగా డాక్టర్ సంధ్యా కొనసాగుతున్నారు. రోగులకు మెరుగైన చికిత్సలు అందించడమే కాక అభివానంగా మాట్లాడుతూ అందరి ఆదరణ పొందారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ సంధ్య, ఆమె తల్లిదండ్రులు కేజీఎఫ్‌లో ఉంటున్నారు. ప్రతిరోజూ కేజీఎఫ్ నుంచి బూదికోటె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు. ఈనెల 6న ఇంటినుంచి ఆసుపత్రికి తండ్రితో కలసి బైక్‌పై వస్తుండగా గాజగ గేట్ వద్ద బైక్‌నుంచి కిందపడి గాయపడ్డారు. తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో ఆమెను కోలారులోని ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రికి చేర్పించారు. మెరుగైన చికిత్సకోసం అక్కడనుంచి బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సలు ఫలించలేదు. చివరకు బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందారని వైద్యులు ప్రకటించారు. కాగా గతంలో కుమార్తె తీసుకున్న నిర్ణయం ప్రకారం అవయవదానానికి తల్లిదండ్రులు అంగీకారం తెలిపారు. ఆమె మృతదేహాన్ని ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రికి తరలించారు. తక్కువ సమయం సేవలందించినా ఉత్తమంగా వ్యవహరించారని ప్రశంసలు పొందిన డాక్టర్ సంధ్యా మరణానంతరం అవయవదానంతో మానవత్వం చాటుకున్నారని ప్రజలు ప్రశంసించారు.

అవగాహన లేమితోనే అగ్ని ప్రమాదాలు

శిడ్లఘట్ట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చాలావరకు అగ్ని ప్రమాదాలకు సరైన అవగాహన లేకపోవడమే కారణమని అగ్నిమాపకశాఖ అధికారి కదిరప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దిబ్బూరహళ్ళిలోని ఎస్ఎంఐ హైస్కూల్‌లో మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో సూచించారు. ఒకవేళ ప్రమాదం జరిగితే మంటల్లో చిక్కుకున్నవారిని ఎలా రక్షించాలి అనే అంశాన్ని వివరించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. దిబ్బూరహళ్ళి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, హరీశ్, కేవీ యమనప్ప, టీచర్‌లు కృష్ణప్ప, మురళి మహేశ్, అశ్వత్థప్ప, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి

జలజీవన్ మిషన్ పనులకు శ్రీకారం

శిడ్లఘట్ట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కుందలగుర్కి గ్రామపంచాయతీ పరిధిలోని చిక్కపాపనహళ్ళి, రేపార్లహళ్ళి గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులకు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు హేమావతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించేలా పథకం అమలైందన్నారు. ప్రతి వ్యక్తికి రోజుకు సగటున 55లీటర్ల నీరు అందించనున్నట్టు తెలిపారు. గ్రామాలలో తాగునీటితోపాటు స్వచ్ఛతను కాపాడేందుకు కృషి చేస్తున్నామని ప్రజలు కూడా సహకరించాలన్నారు. చిక్కపాపనహళ్ళిలో రూ.49.60లక్షలతో 56 కనెక్షన్‌లు, రేపార్లహళ్ళిలో రూ.24లక్షలతో 44 కనెక్షన్‌లు ఇస్తున్నామన్నారు. కుందలు గ్రామంలో 356 నీటి కనెక్షన్‌లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, నారాయణస్వామి, మునిరాజు, మున్నేరెడ్డి, అంబికారత్నమ్మ, సునందమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదానీ అవినీతిపై దేశవ్యాప్త అవగాహన కార్యక్రమాలు

● సామాజిక ఉద్యమకారుడు ఎస్ఆర్ హిరేమఠ

రాయచూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశానికి చెందిన దిగ్గజ పారిశ్రామికవేత్త అదానీ గ్రూప్ కంపెనీ వ్యవహరిస్తున్న అవినీతి వ్యవహారాల పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్త ఆందోళన చేపడుతామని సిటిజన్స్ డెమోక్రటిక్ ఫోరం అధ్యక్షుడు, సామాజిక ఉద్యమకారుడు ఎస్.ఆర్ హిరేమఠ తెలిపారు. ఇందుకు సంబంధించి భావ స్వారూప్యక ఉన్న అన్ని సంస్థలతో కలిసి తాము ఉద్యమ కార్యచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరేల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అదానీ గ్రూప్ కంపెనీ వేల కోట్ల లక్షల కోట్ల ఆస్తులను కూడబెడుతూ దేశంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రముఖ ఆర్థిక వేత్త అంతర్జాతీయ న్యాయస్థానం దృష్టికి తీసుకోరాగా అమెరికా సుప్రీం కోర్టు ఆయన పై కేసులు నమోదు చేసిందన్నారు. ఈ విషయంలో ఇప్పటి వరకు భారత ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేపట్టారు. నిజంగా ప్రధాని నరేంద్ర మోదీకి నైతిక విలువలు ఉంటే అదానీని అరెస్టు చేసి ఆయన అవినీతి వ్యవహారాల పై సమగ్ర విచారణకు ఆదేశించాలన్నారు. కాగా గతంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న మూడు నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేఖంగా సాగిన ఉద్యమాల సందర్భంగా ఇచ్చిన హామిలను ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదే విషయం పై ఇటీవల పంజాబ్, హర్యాణ సరిహద్దుల్లో రైతు సంఘాలు ఉద్యమబాట పట్టగా డిల్లీకి వెళ్లకుండా వారిని అడ్డుకుంటున్న ప్రభుత్వం తీరు గర్హనీయమన్నారు. రైతుల పై బాష్పవాయు గోళాలు ప్రయోగించడం బ్యారిగెడ్‌లు ఏర్పాటు చేసి వారిని డిల్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. కాగా జనవరి 18న లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ ఏర్పాటు చేసిన సిటిజన్స్ ఫోరం 50వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ ప్రజాసంఘాలతో కలిసి సమావేశం నిర్వహిస్తున్నట్లు హిరేమఠ తెలిపారు. అదే సమావేశంలో దేశంలోని అవినీతి వ్యవహారాల పై ఆందోళనలకు కార్యచరణ సిద్ధం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న సామాజిక ఉద్యమకారుడు ఎస్ఆర్ హిరేమఠ

ఆశావర్కర్ల వేతనం వెంటనే పెంచాలి

● సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈరమ్మ

రాయచూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ కర్ణాటక ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈరమ్మ డిమాండ్ చేశారు. దీంతో పాటు ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు మంగళవారం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈరమ్మ మొబైల్ వినియోగం కోసం ఆశా వర్కర్ల పై ఒత్తిడి తేవద్దన్నారు. మొబైల్ ఆప్‌ల వినియోగం పై అవగాహన లేని వారి స్థానంలో ప్రత్యేమ్యాయ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న కనీస వేతనం కేంద్రం ఇచ్చే ప్రోత్సహక ధనంతో పాటు రూ.15 వేలకు తగ్గకుండా మాసిక వేతనం అందజేయాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఆశా వర్కర్లకు ప్రతి ఏటా వైద్య పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారికి ఉచిత చికిత్సనందించే ఏర్పాట్లు చేయాలన్నారు. 60 ఏళ్ల పైబడి పదవి విరమణ పొందిన వారికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మాదిరిగానే గ్రాచుటీ నగదును అందించే ఏర్పాటు చేయాలన్నారు. కాగా ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



నగరంలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ఎస్ఎం కృష్ణకు చేదు అనుభవాలు

» రాజ్‌కుమార్ కిడ్నాప్... అల్లుడి ఆత్మహత్య

బెంగళూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాలపాటు తిరుగులేని రాజకీయ నాయకుడిగానే కాకుండా ఎన్నో పదవుల ద్వారా చారిత్రాత్మక పథకాలను సామాన్యులకు ప్రయోజనం కలిగించే లాంటి సంక్షేమాలను తీసుకొచ్చిన ఎస్ఎం కృష్ణ జీవితంలో రెండు చేదు అనుభవాలు వెంటాడాయి. ఎస్ఎం కృష్ణ సీఎంగా ఉన్నపుడే కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్‌కుమార్‌ను గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కిడ్నాప్ చేశాడు. అప్పటికి సీఎంగా ఎస్ఎం కృష్ణ ఏడాది పాలన సాగించారు. రాజ్‌కుమార్ కిడ్నాప్‌తోపాటు రాష్ట్రమే అట్టుడికింది. ఆయన అభిమానులను కట్టడి చేయడం ప్రభుత్వానికి పెను సవాల్‌గా మారింది. 108 రోజులపాటు రాజ్‌కుమార్ కిడ్నాపర్ల చెరలోనే ఉన్నాడు. రాజ్‌కుమార్‌కు వీరప్పన్‌తో సమస్య ఉందని ప్రభుత్వానికి ముందుగానే సమాచారం ఉంది. అందుకే గాజనూరు వైపు వెళ్తే ముందుగా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని రాజ్‌కుమార్‌కు సూచించారు. ఇలా గాజనూరుకు రాజ్‌కుమార్ వెళ్లే ప్రతిసారి సమాచారం ఇస్తుండగా బందోబస్తు కల్పించారు. అయితే ఒకసారి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే రాజ్‌కుమార్ గాజనూరుకు వెళ్లారు. వీరప్పన్ అనుచరులు రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసి అడవుల్లోకి తీసుకెళ్లారు. రాజ్‌కుమార్‌ను కిడ్నాపర్ల చెరనుంచి బయటకు తీసుకొచ్చేందుకు ఎస్ఎం కృష్ణ అప్పట్లో తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరిపి ఎట్టకేలకు విడుదల చేయించారు.

అల్లుడి ఆత్మహత్య...

ఎస్ఎం కృష్ణ అల్లుడు సిద్ధార్థహెగ్డే అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తగా రాణించినవారు. కెఫె కెఫీ డే ద్వారా సుపరిచితులైన సిద్ధార్థ హెగ్డే అనూహ్యంగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. అంతకు ముందు ఆయన పలు సమస్యలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అల్లుడి ఆత్మహత్య విషయం ఆయన జీవితకాలం మరువలేకపోయారు.

14న హనుమద్ వ్రతం

చేళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చేళూరు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 14న హనుమద్‌వ్రతం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అలంకరణలు ఉంటాయని బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. శనివారం ఉదయం విశేషపూజల అనంతరం భక్తులకు తీర ప్రసాదాల పంపిణీ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

డెయిరీ కార్యదర్శి సస్పెన్షన్

బంగారపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా ఐనోరహోసహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో రూ.8లక్షల అక్రమాలకు కారకులైన కార్యదర్శి ప్రభాకరగౌడను సస్పెండ్ చేస్తూ కోలారు ఉప విభాగం సహకారసంఘాల సహాయక మేనేజర్ ఎన్ నవీన్ ఆదేశాలు జారీ చేశారు. పాలడెయిరీకి సంబంధించి సుమారు 15రోజులపాటు ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ కార్యదర్శి వివిధ ఖాతాలకు అడ్వాన్స్ రూపంలో రూ.1.45 లక్షలు, 36,091 లీటర్ల పాలకు సంబంధించి రూ.1.29 లక్షలు, ఆడిట్ పేరిట వసూలు చేసిన రూ.5.30 లక్షలు మొత్తం రూ.8లక్షల మేర దుర్వినియోగం చేసినట్టు గుర్తించారు. కాగా గత ఆరు సంవత్సరాలుగా ఆడిట్ చేయకపోవడంతో అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. వెంటనే డెయిరీ కార్యదర్శి ప్రభాకరగౌడను సస్పెండ్ చేసి అతడి నుంచి రూ.8లక్షలు వసూలు చేయాలని డెయిరీ అధ్యక్షుడు రమేశ్‌గౌడకు సూచనలు చేశారు.

వీధికుక్కల దాడిలో యువతికి గాయాలు

రాయచూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో గాయపడిన మహాదేవి(20) అనే యువతి ఒకరు కోమాలోకి వెళ్లిన హృదయవిధారక ఘటన నగరంలోని మడ్డిపేట వీధిలో చోటు చేసుకుంది. ఇంటి వద్ద వీధి కుక్కలు గుంపులు-గుంపులుగా వచ్చి ఇంటి ముందున్న యువతి పై దాడి చేయగా దాడిలో యువతి తీవ్రంగా గాయాలపాలైంది. కిందపడిన యువతి మాట్లాడకుండా పడిపోవడంతో తల్లిదండ్రులు వెంటనే చికిత్స కోసం ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వారు సాయంత్రం వరకు చికిత్సనందించి మాట్లాడక పోయే సరికి రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. రిమ్స్ ఆస్పత్రిలో దాదాపు మూడు రోజుల పాటు వైద్య చికిత్సనందించిన డాక్టర్‌లు తాము ఈ కేసును చూడలేమని బళ్ళారి ఆస్పత్రికి రెఫర్ చేశారు. యువతిని బళ్ళారి ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి ఒక్క రోజు చికిత్స నిర్వహించిన అధికారులు మెదడులో రక్తగడ్డకట్టడంతో చికిత్స అందించడం సాధ్యం కాదని ఈమెను బెంగళూరుకు తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. నిరుపేద కుటుంబస్థులైన తల్లిదండ్రులు తాము కూలీనాలి చేసుకుని జీవనం సాగిస్తున్నామని బెంగళూరుకు వెళ్లి చికిత్సనందించే స్తోమత తమకు లేదంటు నిస్సయ స్థితిని వ్యక్తం చేశారు. డాక్టర్‌ల ఒత్తిడితో చేసేదేమిలేక తిరిగి ఇంటికి తీసుకొచ్చి మంగళవారం రిమ్స్ ఆస్పత్రి డాక్టర్‌లను బతిమాలి అక్కడ చేర్పించారు. కాగా వీధి కుక్కల స్వేర విహారాన్ని అడ్డుకట్టలేని మున్సిపల్ అధికారుల తీరు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని వీధి కుక్కలను కట్టడి చేయాలని అంటున్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION): MADANAPALLE
I.P. No. 14/2024


Petitioner: Tekuri Sudhakar
Respondents: M. Bhaskar and others

NOTICE TO 2ND RESPONDENT

Narayanaswamy, Father's name not known. House No. 171, 3rd cross, Kamakshiamma Layout, Yalahanka, Bengaluru-560064. Karnataka State, Cell No. 9611975959.

Notice hereby given under section 19 (2) of the Provincial Insolvency Act that the petitioner has applied to this court praying to adjudge him as an insolvent and you are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material question to the petition on this the 31st day of December, 2024 at 10-30 a.m., failing which the said application will be heard and determined Exparte.

Hearing date: 31-12-2024
//By order of the Court//
B.GOPAL REDDY, B.Com.,B.L., Advocate for Petitioner
Madanapalle. Annamayya District.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.41	1,591.50
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,624	694
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,173	2,490
నీటి నిల్వ (టీఎంసీలు)	91.87	12.33

బెల్గాం ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలి

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బెల్గాం-మునగూరు బెల్గాం ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్లు సౌత్ వెస్ట్రన్ జోన్,సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రకటించడం తగదని కర్ణాటక రాష్ట్ర రైల్వేక్రియా సమితి అధ్యక్షుడు మహేశ్వరస్వామి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనా వైరస్ కారణంగా మహారాష్ట్రలోని కొల్హాపూర్ నుంచి వెళ్లే రోజువారీ ఈ రైలును రద్దు చేశారు. కమిటీ పట్టు బట్టడంతో ఈ రైలును కొల్హాపూర్‌కు బదులుగా బెల్గాం నుంచి పునః ప్రారంభించారన్నారు. వారానికి నాలుగు రోజులు తిరిగే ఈ రైలును సౌత్ సెంట్రల్ రైల్వే, నైరుతీత రైల్వే జోన్ అధికారులు రద్దు చేయడం తగదన్నారు. అధికారులు రైలును తక్షణమే రెగ్యులర్ డైలీ రైలుగా నడపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రైల్వే అధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే బళ్లారి, హొస్పేట్ , కొప్పళ రైల్వే స్టేషన్ల వద్ద పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా రైల్వే క్రియా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటకాలకు తగ్గని ఆదరణ

సిరుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలోనూ పౌరాణిక నాటక ప్రదర్శనలకు ఆదరణ తగ్గలేదని రంగభూమి కళాకారులు ధర్మనగౌడ అన్నారు. సిరుగుప్ప తాలుకాలో సోమవారం రాత్రి అరళిగనూరు గ్రామంలో పాండు విజయ పౌరాణిక నాటక ప్రదర్శన జరిగింది. నాటకం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామప్రముఖులు, ప్రజలు పాల్గొని కళాకారులను ఆనందించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

కంప్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడతారని ఏసీసీ అదానీ కంపెనీ హెచ్ ఆర్ రవిచంద్ర, కార్యదర్శి ఎంఆర్ నరేష్ పేర్కొన్నారు. కుడితిని పట్టణంలో సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు శిక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవిచంద్ర, నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ప్రభుత్వం అందించే సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే పలువురు మహిళలు శిక్షణ పొంది తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. ప్రసన్న, షబ్బీర్, మహిళలు వున్నారు.

ఆలయానికి దారి ఏర్పాటు చేయండి

నంబులపూలకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరికొమ్మెదిన్నె గ్రామంలో అటవీ భూముల్లో ఉన్న మూలగుట్ట మల్లయ్యస్వామి ఆలయానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జీ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు గ్రామస్థులు కోరారు. మంగళవారం మరికొమ్మెదిన్నెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. ఈరహదారి గుండా చాలా మంది రైతులు పొలాలకు వెళ్తుంటారన్నారు. కార్యక్రమంలో కేవీ అంజనప్ప నాయుడు, పాల్‌రెడ్డి, బాలక్రిష్ణ, బావాఖాన్, హమానుల్లా, రాఘవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి కర్తవ్యం

● సమాజంలో జీవించే హక్కు అందరిదీ : మానవ హక్కుల దినోత్సవంలో జిల్లా న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ,డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో చట్టబద్దంగా జీవించేందుకు రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కేజీ శాంతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రీడ్స్ ఇనిస్టిట్యూట్, విద్యాశాఖ, జిల్లాబార్ అసోయేషన్, కర్ణాటక మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ బళ్లారి ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకోర్టులో అవగాహన జాథాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో జీవించే ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు, ఆరోగ్యహక్కు,గృహ హక్కు, ఉపాధి హక్కు, విద్యాహక్కు, సహా అనేక హక్కులు ఉన్నాయన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. సమాజంలో అత్యంత అట్టడుగున ఉన్న ప్రజలు కూడా సామరస్యపూర్వకంగా జీవించే మానవ హక్కులు ఉన్నాయన్నారు. స్త్రీల స్వయం సమృద్ధితో కూడిన సమానత్వం వ్యక్తమవుతుంది. రీడ్స్ సంస్థ మహిళలకు ఉచిత వాహన శిక్షణ ఇచ్చి ఆత్మగౌరవంతో జీవనం సాగించేలా చేయడం అభినందనీయమన్నారు. అదే సమయంలో కురుగోడు తాలూకా బాదనహట్టి గ్రామానికి చెందిన నారాయణమ్మ అనే మహిళ రీడ్స్ సంస్థ ఇచ్చిన ఆటో రిక్షా తాళం చెవిని అందజేసి మొదటి ఆటో రిక్షా డ్రైవర్‌కు జీవనోపాధి కలగాలని ఆకాంక్షించారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి

అవగాహన జాతా

ప్రపంచ మానవహక్కుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన జాతాను జిల్లాకోర్టు ఆవరణ నుంచి ప్రారంభమై కనకదుర్గమ్మదేవాలయం మీదుగా జిల్లాపోలీసు సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణకు చేరుకుంది. ఈసందర్భంగా జిల్లాకోర్టు న్యాయమూర్తి సిద్దలింగప్రభు, న్యాయాధికారి విద్యాధర శిరహట్టి, న్యాయమూర్తి నాఘవేంద్రగౌడ్, రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి ప్రమోద్, న్యాయాధికారి వాసుదేవగుడి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె, కోర్టున్యాయమూర్తులు, రీడ్స్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిప్పేశప్ప, కోర్టుసిబ్బంది,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రీడ్స్ సంస్థ అందజేసిన ఆటోను నడుపుతున్న డ్రైవర్ నాయణమ్మ

ప్రభుత్వ ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలి : డీసీ

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వెంట్లు కెరీర్ డెవలప్‌మెంట్ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిలు, కార్యక్రమాలను పూర్తిస్థాయిలోఅమలు చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. మంగళవారం నగర కలెక్టరేట్ కార్యాలయం హాల్లో ఏర్పాటు చేసిన సఫాయి కర్మచారి జిల్లా స్థాయి అవగాహన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మాన్యువల్ స్కావెంజర్లకు ఆయా స్థానిక, పట్టణ సంస్థల ధ్రువీకరణ పత్రాలు (అంథంటికేషన్) పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ అధికారులకు సూచించారు. సఫాయి కర్మచారుల సుస్థిర ఆరోగ్యం కోసం బిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఆరోగ్య శిబిరం నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. పౌరకార్మికులకు యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్‌లు, రెయిన్‌కోట్, బ్లీచ్ పౌడర్, ఇతర అవసరమైన ఉపకరణాలు సరిపడా అందించాలన్నారు. సివిల్ ట్యాంక్‌ను శుభ్రం చేసేటప్పుడు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని , పౌర కార్మికుల దృష్ట్యా సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలన్నారు. సఫాయి కర్మచారి డివిజన్ జిల్లా అవగాహన కమిటీ సభ్యులు కందకూర్ రాముడు మాట్లాడుతూపౌరసఫరాల శాఖ కార్మికులకు సకాలంలో వేతనాలు అందజేయాలన్నారు. సామాజిక భద్రత, భవిష్యత్తుకోసం ఉద్దేశించిన ఈఎస్ఐ. ఈపీఎఫ్ నిధులు సివిల్ కార్మికుల సొత్తు అని, బిమ్స్‌లో పనిచేస్తున్న సివిల్ కార్మికులకు ప్రైవేట్ ఏజెన్సీ ఓం సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ద్వారా ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఇవ్వలేదన్నారు. కర్ణాటక రాష్ట్ర సఫాయి కర్మచారి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న పథకాల గురించి సౌరసత్వ కార్మికులకు సమాచారం అందించి అర్హులైన లబ్దిదారులు సకాలంలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈసందర్భంగా జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి , అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.మల్లికార్జున, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా

వాల్మీకి భవనం దుస్థితిపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

సిరుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాధనం రూ. మూడు కోట్ల వ్యయంతో నిర్మించిన వాల్మీకి భవనాన్ని నిరుపయోగంగా వదిలేయడంపై మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వాల్మీకి భవనాన్ని సందర్శించిన ఆయన నగరసభ ఎస్టీ అభివృద్ధి నిగమ అధికారుల నిర్లక్ష్యం వలన వాల్మీకి భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారని ఆరోపించారు. భవనంలో అపరిశుభ్రత నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు ఈ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.



వాల్మీకి భవనాన్ని పరిశీలిస్తున్న సోమలింగప్ప

జమిలి ఎన్నికలు అసాధ్యం

కదిరి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఇది ఆచరణకు సాధ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశమం తటా లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరపడం అసాధ్యమన్నారు. ఇందుకు 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుం దన్నారు. ఎన్నికల ఖర్చు మొత్తం బడ్జెట్‌లో 0.01శాతం మాత్ర మేనని, కావున ఎన్నికల ఖర్చు తగ్గించుకోవడం కోసమే జమిలి ఎన్నికలకు వెళ్లడం అర్థం లేదని అన్నారు.



ఏడీసీ జుబేరాకు వినతి పత్రం అందజేస్తున్న సవితా సమాజం సభ్యులు

యత్నాల్ వ్యాఖ్యలపై సవితాసమాజం నిరసన

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సవితా సమాజాన్ని దూషించిన బీజాపూర్ ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాల్ పై చర్యలు తీసుకోవాలని సమాజ సభ్యులు ఆందోళన చేపట్టారు. బళ్లారి నగరంలోని రాయల్ సర్కిల్ వద్ద నగర సవితా సమాజ్ సంఘ కార్యకర్తలు సమావేశమై యత్నాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ వినతి పత్రం స్వీకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈసందర్భంగా నిరసన కారులను ఉద్దేశించి సవితా సమాజ్ నగర అధ్యక్షుడు ఆరుణ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2011లోనే 'హజామా' అనే పదాన్ని నిషేధించిందన్నారు. కార్యక్రమంలో బళ్లారి నగర సవితా సమాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి సి.నారాయణ, కోశాధికారి ఆనంద్, యువజన విభాగం అధ్యక్షుడు రాకేశ్ చంద్రశేఖర్, నాగరాజ్, కృష్ణ, వెంకటరావు, గోవింద, సభ్యులు సుమన్, మోహన్, గంగాధర్, మహేశ్, మురళి, మారుతి, చిట్టిబాబు, ప్రతాప్ సహా వందలాది మంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కర్నల్ హరిజిందర్ సింగ్

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు దేశభక్తి ఏర్పడుతుందని 34వ కర్ణాటక బెటాలియన్ కర్నల్ హరిజిందర్‌సింగ్ పేర్కొన్నారు. బళ్లారి విశ్వేరయ్య ప్రాథమిక ఉన్నత పాఠశాల, పదవిపూర్వ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చురుగ్గా ఎన్‌సీసీలో చేరి ఆరోగ్యంతో పాటు దేశభక్తిని అలవరచు కోవాలన్నారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారులు అమరదీప్, కిరణ్‌కుమార్, రంజిత్‌కుమార్, విద్యాసంస్థ కార్యదర్శి మన్నెం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, వైస్.ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే



జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కంప్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ద్వారా వచ్చే సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. మంగళవారం కంప్లి పట్టణంలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖకు ఇచ్చే సదుపాయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారులకు 2023-24 సంవత్సరం నాటి పలు సదుపాయాలను కల్పించారు. వాటి ద్వారా కుటుంబాన్ని ఆర్థికంగా మెరుగుపరచుకోవాలన్నారు. అలాగే తమ ఇళ్లలో పారంపర్యంగా వచ్చే చేపలుపట్టే వృత్తి కాకుండా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివప్ప, భవాని, శ్రీకుమార్, దానప్ప, సుధీర్, చిన్న రాజు, రేణుకగౌడ, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కేంద్రం వైఖరిపై కాంగ్రెస్ ఆగ్రహం



నిరసనలో కాంగ్రెస్ నాయకులు

హోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మణిపూర్ అల్లర్లను ఆపడంలో విఫలమైన కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. గాంధీవిగ్రహం దగ్గర ఏర్పాటైన నిరసనలో పశ్చిమ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్ అధ్యక్షత వహించారు. జిల్లా ప్రెసిడెంట్ త్యాగరాజన్, కాంగ్రెస్ కార్యవర్గం మైజా అక్బర్ నిరసనకు నాయకత్వం వహించారు. నిరసనలో ఆర్టీఐ జిల్లా కమీషనర్ అసెన్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఇర్షాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశం, నాయకత్వం వహించారు. నిరసనలో ఓబీసి జిల్లా అధ్యక్షుడు కుమార్, మహిళా బృందం లలిత, అయూబ్, సమీవుల్లా, జాంబేరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదాధికారుల సమావేశం

హోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హోసూరు మైక్రో ఇండస్ట్రియల్ అసోసియేషన్ (హోస్మియా) పదాధికారల సమావేశం నగరంలోని కామరాజనగర్‌లో జరిగింది. అధ్యక్షులు మురుగేశన్ అధ్యక్షత వహించగా, రీజియన్-2 ఉపాధ్యక్షులు శరవణన్ స్వాగతం పలికారు. శేఖర్, డాన్సియా ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడు, సెక్రటరీ రజినికాంత్, కోశాధికారి వెంకటేశన్, ఎగ్జిక్యూటీవ్ కమిటీ అధ్యక్షుడు, మునుస్వామి నాయకత్వం వహించారు. కొత్త సభ్యులకు జారీ చేయబడిన సర్టిఫికెట్లు, ప్రధాన తీర్మానాలు ప్రస్తావించారు. ప్రస్తుతం 18 శాతం చిన్న, అద్దెపై జీఎస్టీ పన్ను ఉంది. ఎలక్ట్రిసిటీ బోర్డు విధించే పవర్ ఫ్యాక్టర్ చార్జీలు తగ్గించాలని ప్రస్తావించారు. హోసూరు గృహనిర్మాణ రంగంలో 8వేలకు పైగా చిన్న సూక్ష్మ పరిశ్రమలు పనిచేస్తున్నాయని, దానికి బదులు ప్రస్తుతం సిఫ్‌కాట్ ఇండస్ట్రియల్ పార్కు కోసం తీసుకుంటున్న సిట్‌కో విడివిడిగా భూమిని కేటాయించాలన్నారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలా వరకు రోడ్లు ఇంకా మట్టిరోడ్డుగా ఉన్నాయని, వీటిని తారురోడ్డుగా తీర్చిదిద్దాలన్నారు. డిప్యూటీ సెక్రటరీ రాజేశ్ కణ్ణన్ డిమాండ్లను వివరించారు.



పిచ్చిమొక్కలతో నిండిన కేంద్రం

అసౌకర్యాల మధ్య వర్షమాపక కేంద్రం

కంప్లి, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని అతిథి గృహంలో వర్షపు కొలమాన కేంద్రంలో అపరిశుభ్రత పేరుకుపోయింది. కార్యాలయం చుట్టూ చెత్తా చెదారం, పిచ్చి మొక్కలుపెరిగిపోయాయి. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అపరిశుభ్రత కారణంగా వర్షం కొలవడంలో తేడాలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు అపరిశుభ్రతను తొలగించి వర్షమాపకాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా రాజాజీ జయంతి



రాజాజీకి నివాళి అర్పిస్తున్న అధికారులు

హోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న అందుకున్న తొలి వ్యక్తి రాజాజీగా పేరొందిన రాజగోపాలచారి 146వ జయంతి తొరపల్లి అగ్రహారంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె.ఎం.సరయు ఆధ్వర్యంలో రాజాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజాజీ విగ్రహానికి హోసూరు మేయర్ సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజాజీ జీవితచరిత్రకు సంబంధించిన చాయాచిత్రాలను కలెక్టర్ ప్రజా ప్రతినిధులు, పర్యాటకులు వీక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. హోసూరు కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, హోసూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, న్యూస్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి మోహన్, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి, రమేశ్, పబ్లిక్ వర్క్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుళ్, యూనియన్ కమిటీ సభ్యురాలు ఉమా శ్రీనివాస్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షురాలు శాంతమ్మ నంజప్ప, రాము, పంచాయతీ కౌన్సిల్ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పన్నును తప్పనిసరి చేయడంపై నిరసన

హోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ పన్నును తప్పనిసరి చేయడంపై హోసూరు దుకాణదారులు మంగళవారం నిరసన తెలిపారు. వ్యాపారుల సంఘం తరపున కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తమిళనాడులో ఎక్కడా లేని విధంగా పన్ను పెంచి స్వచ్ఛభారత్ చెత్త పన్ను తప్పనిసరి చేయడాన్ని ఖండించారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్నును పెంచి బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్వచ్ఛభారత్ చెత్తపన్ను 2017 నుంచి ప్రస్తుతం వరకు అంటే ఏడేళ్లపాటు పన్ను విధించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ ఇలా మాట్లాడుతూ తమిళనాడులో పన్నుల పెంపు తారస్థాయికి చేరిందన్నారు. ఏడేళ్లుగా పన్ను వసూలు చేయడంలో విఫలమై ప్రస్తుతం కార్పొరేషన్ అధికారులు వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో దుకాణదారులు నిరసనలో పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న ఆందోళనకారులు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన వాహనాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అయ్యనగౌడ

బళ్లారి సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ అయ్యనగౌడ పాటిల్ సూచించారు. మంగళవారం నగరంలోని ప్రాంతీయ రవాణాశాఖ అధికారుల కార్యాలయ ఆవరణలో రాష్ట్రరోడ్డు భద్రత అథారిటీ, రవాణాశాఖ సహకారంతో ఎల్ఈడీ వాహనాల ద్వారా రోడ్డు భద్రతపై వాహన వినియోగదారులకు, రోడ్డు వినియోగదారులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడంతోనే రాష్ట్రంలో ప్రమాదాలు జరిగి ఏటా లక్ష మందికిపైగా మృత్యువాత పడుతునారన్నారు. ప్రధానంగా యువతే అత్యధికంగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రోగ్రామ్ మేనేజర్ రమ్య రంగోలి మాట్లాడుతూ జిల్లాలో 10రోజుల పాటు 5ఎల్ఈడీ వాహనాలు ప్రయాణించి రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా ప్రాంతీయ రవాణా అధికారి శ్రీనివాసగిరి, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పోలీస్ అధికారి బి.షపివుల్లా, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ అహ్మద్, రవాణాశాఖ సిబ్బంది తదితరులు యువత, ప్రజలతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

వైభవంగా జోడు రథోత్సవాలు



అలంకరణలో పేట బసవేశ్వరస్వామి

కంప్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిగాంచిన నీలమ్మ, పేట బసవేశ్వర స్వాముల జోడు రథోత్సవాలు మంగళవారం కనుల పండువగా జరిగాయి. ఉదయం పేట బసవేశ్వరస్వామి, నీలమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం లక్షలాది మంది భక్తాదుల మధ్య జోడు రథోత్సవాల ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



నీలమ్మదేవి

రైతులకు ఉచితంగా ధర్మస్థల బస్సుయాత్ర

బళ్లారిరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో శ్రీవాణి ట్రేడర్స్ యజమానులు విజయ్ కుమార్, శివకుమార్ ఆధ్వర్యంలో ఐదవ సంవత్సరం రైతులకు ఉచితంగా ధర్మస్థల బస్సుయాత్ర ఏర్పాటు చేయనున్నారు. బళ్లారి ఏపీఎంసీ నుంచి పేద బడుగు బలహీన వర్గాల రైతులకు శ్రీవాణి ట్రేడర్స్ ఆధ్వర్యంలో ధర్మస్థలం, శృంగేరి, హొరనాడుతో పాటు ఐదు రోజుల పాటు తీర్థయాత్రలు నిర్వహించనున్నారు. ఏటా సంస్థ ఆధ్వర్యంలో తీర్థయాత్రలు నిర్వహిస్తారు. ఈ యేడాది రెండు బస్సులకు గాను 108 మంది రైతులను ధర్మస్థల యాత్రకు సోమవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. రైతులను ప్రోత్సహించడానికే యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ దళారి సంఘం అధ్యక్షుడు చిదానందప్ప, కార్యదర్శి గురుస్వామి, వెంకటేష్, స్వాతి, గోవిందరాజులు, మాజీ కౌన్సిలర్ కోదండ రాముడు, శ్రీనివాసులు, మంజు తదితరులు పాల్గొన్నారు.